# సారద

"నీ అభిమాన రచయిత్రి ఎవరు?"

అనడిగితే చాలామంది అనేక పత్రికలకి పాప్యులర్ సీరియల్స్ రాసి, వాటిని సినిమా నిర్మాతలకు అమ్మిన ఒకరిద్దరు పెద్ద రచయిత్రుల పేర్లు చెప్పటం పరిపాటి. ఆ ఇద్దరి రచనలని నేనూ అసక్తిగా చదువుతాను. కాని ప్రస్తుతం వారి వయసు నలభై పైనే అని ప్రచురింపబడ్డ వాళ్ళ ఫోటోలవల్ల తేలికగా గ్రహించవచ్చు. ఆ కారణం వల్లే అనుకుంటాను, ఆ ప్రశ్నకి నా సమాధానం మాత్రం సారద ఆమె నా అభిమాన రచయిత్రి అని నొక్కి చెప్పడంలో ఎలాంటి సంశయం నాకులేదు.

పాతికేళ్ళ బ్రహ్మచారినని ఈ మాట చెప్పడంలేదు నేను. ఆ ఇద్దరు పెద్ద రచయితలకన్నా నాలుగైదు మార్కులు తక్కువే పొందగల రచనలు చేసినా, సారద నా అభిమాన రచయిత్రి. ఆమె రాసిన కొద్ది నవలల్లో ఓ అంశం విధిగా వుండటం గమనించాను. ఒకతన్ని వివాహం చేసుకుని ఇంకొకతన్ని హీరోయిన్ ఇంకా ప్రేమించడం. కుంటికాలో ఇంకేదో అంగవైకల్యమోగల సంతానం హీరోయిన్‌కి వుండటం, హీరోయిన్ బీద వర్గానికి చెంది ఎవరింట్లోనో పనిమనిషిగా వుండటం లేదా హీరోయిన్ భర్తకి మరో స్త్రీతో సంబంధం వుండటం.... ప్రతీ నవల్లో ప్రతీ కథలో ఆమె హీరోయిన్స్ దౌర్భాగ్యస్థితిలో వుంటుంటారు.

ఓ రోజు ఓ దినపత్రిక తిరగేస్తుంటే అందులో ఆదివారం అనుబంధంలో సారద రాసిన సీరియల్ మొదలవడం చూసాను. "మనసే కోవెలగా...." దాని పేరు.

ఆ పత్రికలో ఆవిడ చిరునామా కూడా ప్రచురించారు. ఎడ్రస్ తీసుకొని ఆమె దగ్గరకి వెళ్ళాలనుకోవడానికి కారణం నాలోని బ్రహ్మచారి కోతిమనసేనని ఒప్పుకోవటం సంస్కారుల లక్షణం అనుకుంటాను.

ఆ దినపత్రికలో నవలతో పాటు, ఆమె ఫోటో కూడా ప్రచురించారు. "ఫర్వాలేదు" అనే స్థాయికి వో డిగ్రీపైనా, "అందంగా వుంది" అనే

స్థాయికి వో డిగ్రీకింద వుందామె. ఆమె మొహంలో యెలాంటి కష్టాల తాలూకు ఛాయలు లేవు.

సాయంత్రం ఆ చిరునామా పట్టుకుని వాళ్ళింటికి వెళ్ళాను. బయట నించే చూస్తే చాలా సాదాసీదా ఇల్లది. లోపలనుంచి ఎవరో గట్టిగా మాట్లాడటం వినబడుతోంది. తలుపు తడితే వో ముసలాయన తలుపు తీశాడు.

"సారద గారుండేది యిక్కడేనా?" అడిగాను

"మీరెవరు?"

"ఆవిడ అభిమానిని"

ఆయన లోపల కెళ్ళాడు ఆ గదిమూల కూర్చునున్న వో ఆరేళ్ళ కుర్రాడిని చూశాను. సారద పోలికలనిబట్టి ఆమె తమ్ముడుగా గుర్తించాను. అతని కాలు వంక చూశాను అవిటిది కాదు. అమ్మయ్య.

ఓ నలభై యేళ్ళావిడ బయటికి వచ్చింది ఆమెలో సారద పోలికలు స్పష్టంగా కనబడ్డాయి. సారద తల్లి పోలికన్నమాట తండ్రిది కాదు.

"యెవరు కావాలి?" అడిగిందావిడ.

"సారదగారు"

నావంక పరిశీలనగా చూసి అడిగింది "దేనికి?"

"ఆమె అభిమానిని, చూద్దామని వచ్చాను"

"నేనే" కొంగుతో కుడిచేతి తడివి తుడుచుకుంటూ చెప్పింది.

నోరు తెరచుకుని చూస్తుండిపోయాను ఆవిడవంక. నేను ఫోటోలో చూసిన ఆ తళుకు ఆ వయసు యేవి?

"కె డబ్ల్యు సారదగారండీ" చెప్పాడు మళ్ళీ.

"నేనే" నవ్వింది.

"మరి ఆ ఫోటో...." అర్థోక్తిగా ఆగాను.

"మా ఆవిడదే" అని సారద తండ్రిగా నేను భావించిన సారద భర్త చెప్పి, ఆవిడవేపు తిరిగి చెప్పాడు. "చెప్పానా శోభనం గదిలోకి వెళ్ళేప్పుడు తీయించుకున్న ఫోటో పత్రికలకి పంపద్దని."